క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన డాక్టర్ రమణమూర్తి



రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసిన డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార : ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో కొద్ది సేపు చర్చించారు. ఈ సందర్భంగా 'ఎలా ఉన్నారు డాక్టర్‌గారు?' అంటూ వైవీ సుబ్బారెడ్డి ఆప్యాయంగా డాక్టర్ రమణమూర్తిని పలకరించారు.

20, 21 తేదీల్లో వార్షిక సమావేశం



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: ఈ నెల 20, 21 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్ 28వ ఆసియా పసిఫిక్ ఫోరం వార్షిక సమావేశం, ద్వైవార్షిక సమావేశం నిర్వహించనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆసియా పసిఫిక్ దేశాల సమస్యలతో పాటు, మానవహక్కులు, వ్యాపార వాణిజ్య సంబంధిత అంశాలు చర్చించనున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పని చేస్తున్న తమ స్వచ్ఛంద సంస్థను కూడా ఆహ్వానించారని మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు ఎస్‌వీ రమణ, వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

సెయింట్ జోసెఫ్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్ రేపు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 17వ తేదీన నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు ఇంటర్ బైపీసీ పాసైన విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కళాశాల ఫీజులో 100 శాతం రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 92473-62689 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కవితకు ఈడీ నోటీసుల జారీ కక్ష సాధింపు చర్యే



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసనలో పాల్గొన్న ఏపీ బీఆర్ఎస్ నాయకులు

సీతమ్మధార : తెలంగాణ ఎమ్మెల్సీ, భారత రాష్ట్ర సమితి మహిళా నాయకురాలు కల్వకుంట్ల కవితకు ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఏపీ బీఆర్ఎస్ నాయకులు జేటీ రామారావు, తలారి సురేష్ అన్నారు. ఈ మేరకు ఈడీ చర్యలకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అతి తీవ్రమైన ఆర్థిక నేరస్థుడు అదానీని అరెస్ట్ చేయలేని చేతకాని ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అందరికీ భరోసా

- అదే జగనన్న ఆరోగ్య సురక్ష
- మొదలైన ఇంటింటి సర్వే
- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య సర్వే చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం 5 విడతలుగా జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి మొదటి విడతలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీపై అవగాహన, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎక్కడెక్కడ ఉన్నాయో, ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఏ ఆస్పత్రికి వెళ్లాలో అనే అంశాలు తెలియజేయడంతో పాటు ఉచిత వైద్య సేవలను ఎలా వినియోగించుకోవాలన్న దానిపై అవగాహన కల్పిస్తారని అన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తల బృందం ప్రజలకు ఇంటి వద్దే ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ఆ వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ వివరాలు హెల్త్ క్యాంపు జరిగే నాటికి ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి 45 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా హెల్త్ క్యాంప్‌లు జరుగుతాయన్నారు. నిపుణులైన గైనకాలజిస్టులు 31 మంది, పిల్లల వైద్య నిపుణులు 18 మంది, జనరల్ మెడిసిన్ 41 మంది, ఇతర స్పెషలిస్ట్‌లు 31 మంది, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 31 మంది, వైద్యాధికారులు (యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ) నుంచి 83 మంది, వీరే కాక క్షేత్ర స్థాయిలో 554 మంది ఏఎన్ఎంలు, 885 మంది ఆశ కార్యకర్తలు, 54 మంది కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లు (సీహెచ్‌వో) జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని గ్రామ/పట్టణ ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని డీఎంహెచ్‌వో తెలిపారు.

పేదలకు వరం 'పోషణ్ అభియాన్'



పౌష్టికాహారం తయారు చేసి చూపిస్తున్న స్త్రీ శిశు-సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం : పేదలకు వరం పోషణ్ అభియాన్ పథకం అని స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ఏసీడీపీవో శ్రీలత అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన పోషణ్ అభియాన్ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో గర్భిణులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ సమస్యను తొలగించేందుకు ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం పోషణ్ అభియాన్ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో పదార్థాలను స్వయంగా తయారు చేసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి, అమ్మవారి వీధి అంగన్‌వాడీ కార్యకర్త అరుణ, బంగారుమెట్ట, కుమ్మరవీధి అంగన్‌వాడీ కార్యకర్తలు నాగేశ్వరి, భారతి, సరిత, ఆయా కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో 300 మట్టి ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పర్యావరణ పరిరక్షణ దిశగా కృషి చేయాలని చెప్పడంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రసాయనాలు కలిసిన రంగులతో చేసిన వినాయక ప్రతిమలు నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం అవుతుందన్నారు. మట్టి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-4 కమిషనర్ కె.శివప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ట్రస్టీ బెహరా వెంకటరత్నం, స్టేట్ డైరెక్టర్లు రవీంద్ర, ఆదివిష్ణు, లండా రమణ, బొగ్గుశ్యామ్, బోని దేవా, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ

అల్లిపురం : దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ జరిగింది. 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ ఆధ్వర్యంలో వార్డులో నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలోని నీలమాంబ ఆటోస్టాండ్, గోవింద్‌రోడ్డు, బంగారుమెట్ట కాలనీలో గల ఆటోస్టాండ్లలో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వార్డు సీనియర్ సచివాలయ కన్వీనర్లు ఆదారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, మదీనాఖాన్, బూర్ల చిన్న, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుకకొండ రోడ్డు విస్తరణకు శ్రీకారం

- జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



రోడ్డుకు అడ్డంగా ఉన్న దుకాణాలు తొలగింపజేస్తున్న ఏసీపీ వినయ్‌కుమార్

జగదాంబ : ఎట్టకేలకు ఇసుక కొండ రహదారి నిర్మాణానికి మోక్షం కలిగింది. జీవీఎంసీ 36వ వార్డులో గల ఈ ఆలయం నుంచి కేజీహెచ్‌కు వెళ్లడానికి కూడా రహదారి నిర్మించాలని జీవీఎంసీ గతంలోనే ప్రతిపాదించింది. ఆ దారిని పూర్ణా మార్కెట్ దగ్గర నుంచి నిర్మాణం మొదలుపెట్టాలని అధికారులు భావించారు. అయితే అక్కడ వ్యాపారాలు చేసుకునే కొంత మంది రహదారి నిర్మాణానికి అడ్డుపడటంతో సుమారు 12 సంవత్సరాలు గడిచిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల వచ్చిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ నగరాభివృద్ధికి అవసరమయ్యే ప్రధాన రహదారులపై దృష్టి సారించారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పటికే వన్‌టౌన్ రహదారిని జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సంవత్సరాలుగా నిలిచిపోయిన ఇసుకకొండ రహదారి నిర్మాణానికి కూడా మోక్షం లభించింది. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం జీవీఎంసీ జోన్-4 ఏసీపీ వినయ్‌కుమార్ రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న దుకాణాలను జేసీబీ సాయంతో తొలగింపజేశారు. దీంతో అక్కడ రహదారి నిర్మాణానికి అడ్డంకి తొలగిపోయిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



34వ వార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం అచ్చియ్యమ్మపేటలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 32, 33, 34 వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ఎమ్మెల్యే వాసుపల్లి వాటిపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో జేసీజే అధ్యక్షుడు పీతల వాసు, కర్రి నీలకంఠం, పార్టీ సీనియర్ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, బోణి దేవ, బొర్రా శ్రీనివాసరెడ్డి, వాసుపల్లి నారాయణ, బాబుల్ శ్రీను, దూడ అప్పారావు, అరుగుల రాజు, కుమారి, కృష్ణవేణి సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ఏవీఎన్ కాలేజీకి దగ్గరలో గల జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వార్డు ప్రెసిడెంట్ మాణిక్యాలరావు, నొల్లు పోతుస్వామి, బెహరా వెంకటరత్నం, మీసాల అశోక్, ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ వడ్డాది దిలీప్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆదివిష్ణు, బొగ్గు శ్యామ్, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 4 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 4 ఫిర్యాదులు అందాయని అదనపు కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి రెండు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులు పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, డీడీహెచ్ దామోదరరావు, జేడీ అమృత్ విజయభారతి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డీసీ (ఆర్) ఫణిరాం, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో భక్తులు

దాబాగార్డెన్స్ : గత నెల 17 నుంచి ఈ నెల 15 వరకు కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహించిన శ్రావణలక్ష్మి పూజలు శుక్రవారంతో ముగిసాయి. చివరి రోజున మహాపూర్ణాహుతి నిర్వహించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది శ్రావణమాసం పూజల్లో అత్యధిక మంది భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం..

శుక్రవారం క్షీరాభిషేకం ఘనంగా జరిపారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించినచో పూజకు ఇద్దరు దంపతులను అనుమతించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజకు సంబంధించి వివరాలకు 0891-2566514, 8985515989 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ధనలత, సుబ్రహ్మణ్యం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి..

కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారంతో శ్రావణమాస పూజలు ముగిసాయి. చివరి రోజున అమ్మవారు పట్టు వస్త్రాలంకరణలో దర్శనమిచ్చారు. 108 స్వర్ణ పుష్పాలు, పట్టు వస్త్రాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆరిశెట్టి దినకర్, గ్రంథి రామకృష్ణారావు, ఆర్‌బీబీ కుమారశర్మ, వేదా కవిత, కొత్తా సాహిత్య, కుంచం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ఓలా, ఉబర్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విశాఖ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ ఓలా, ఉబర్ యాజమాన్యాలు తమ సమస్యలు పరిష్కరించకపోగా ఉన్న రేట్లు తగ్గించాయని అన్నారు. ఇక్కడున్న ఉబర్ ప్రతినిధికి డ్రైవర్ల సమస్యలు చెప్పుకుంటే తమనే వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కలగజేసుకుని ఓలా, ఉబర్ యాజమాన్యాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్ లాంటిది మన రాష్ట్రంలోనూ నిర్వహించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాస్, పోలినాయుడు, శ్రీను, శరత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బుచ్చిరాజుకు అవార్డు ప్రదానం

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు న్యూరాలజికల్ సర్వీసెస్‌కు చేసిన కృషికి ఫెలో ఆఫ్ ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ అవార్డు పొందారు. మధురైలో జరుగుతున్న ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా శుక్రవారం డాక్టర్ బుచ్చిరాజుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ అధ్యక్షుడు డాక్టర్ గగన్‌దీప్‌సింగ్ ఈ అవార్డును డాక్టర్ బుచ్చిరాజుకు అందజేశారు.

జీమా అమలులో ఉన్నందున పరిహారం చెల్లించాలి

విశాఖ లీగల్ : వినియోగదారునికి బీమా అమలులో ఉన్నందున వ్యక్తి మృతి చెందితే రావలసిన పరిహారాన్ని చెల్లించాలని వినియోగదారుల మండలి న్యాయమూర్తి జి వెంకటేశ్వరి, సభ్యులు పి.విజయ దుర్గ,కే.రమణ బాబులు తీర్పునిచ్చారు. బీమా నిబంధనల ప్రకారం మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు బీమా సొమ్ము, రూ.లక్ష నష్టపరిహారం, రూ.10 వేలు ఖర్చులు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వినియోగదారుడు కర్రి రమణబాబు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండల పరిధిలోని బౌరాడ గ్రామ నివాసి. 2016 సెప్టెంబర్ 27వ తేదీన విశాఖలోని ఏవీఎన్ కళాశాల దగ్గర ఆంధ్ర బ్యాంకు వెళ్లారు. ఇండియా ఫస్ట్ ఇన్సూరెన్స్ కంపెనీ సంబంధించి కొన్ని వాయిదా చెల్లించాడు. బీమా తీసుకొని కొన్ని నెలలకే అస్వస్థతతో మృతి చెందాడు. బీమా సౌకర్యం ఉన్నందున తమకు పూర్తి పరిహారం రూ.5 లక్షలు ఇవ్వాలని రమణ బాబు భార్య ఫోరమ్‌ను ఆశ్రయించారు. ఫస్ట్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ముంబాయి, విశాఖపట్నం కార్యాలయం, ఆంధ్రా బ్యాంక్ సంయుక్తంగా పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు తమ తీర్పుని మూడు నెలల్లో అమల పరచాలని వినియోగదారుల ఫోరం బీమా కంపెనీలను ఆదేశించింది. అయినా బీమా కంపెనీ పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాదు తరపున న్యాయవాది ఆదారి అప్పారావు శుక్రవారం అమలు పిటిషన్ దాఖలు చేశారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ రవిశంకర్

దొండపర్తి : వినాయక చవితి సందర్భంగా నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ శాఖ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఏపీఈపీడీసీఎల్, రవాణా, ఏపీ ఫిషరీస్, మెరైన్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల్లో బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అలాగే జీవీఎంసీ, ఫిషరీస్ ద్వారా తగినంత మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి వారికి సరిపడా లైఫ్ జాకెట్లు అందించాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా పాయింట్ల వద్ద హైడ్రాలిక్ హై ఎండ్ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల ద్వారా కరపత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. ఆస్పత్రి, పాఠశాలలు, మతపరమైన ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడకంపై పరిమితులు ఉంటాయని, గణేష్ మండపాల వద్ద మ్యూజిక్ 10 డెసిబుల్స్‌కు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో అగ్నిమాపకదళం/రెస్క్యూ మేనేజ్‌మెంట్ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముఖ్యమైన గణేష్ మండపాల వద్ద మొబైల్ ఫైర్ ఎక్స్‌టింగిష్టర్లను, బకెట్ ఇసుక, నీటిని అందుబాటులో ఉంచేందుకు నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాగర్‌నగర్, అప్పికొండ, ఇతర నిమజ్జన ప్రదేశాల్లో సంబంధిత ఎస్‌హెచ్‌వోలను సంప్రదించి ఆర్టీసీ బస్సుల మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని, ఆ సర్టిఫికెట్ నిమజ్జనానికి వినియోగించే ప్రతి వాహనంలో ఉండాలన్నారు.

మండపాలకు అనుమతులకు ..

మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం 4వ అంతస్తులో ఉండే రీజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక ఈపీడీసీఎల్ ఏఈ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఆ ఎన్‌వోసీతో సంబంధిత పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను సంప్రదిస్తే అనుమతి ఇవ్వనున్నారు.

ఫైర్ అనుమతుల కోసం..

ఆర్ఎఫ్‌వో - 9989961135
డీఎఫ్‌వో - 9912448555
ఎస్ఎఫ్‌వో - 7989495108

తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు..

జోన్-1 (సీతమ్మధార నుంచి హనుమంతవాక) - 9440812488
జోన్-2 (కంచరపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్) - 9440812489
జోన్-3 (మధురవాడ-భీమిలి-హనుమంతవాక) - 9490606924

జేసీఐ విశాఖ వ్యాలీ సేవలు మరువలేనివి

అల్లిపురం : జేసీఐ విశాఖ వ్యాలీ సేవలు మరువలేనివని జేసీఐ ఇండియా జోనల్ ప్రెసిడెంట్ జీవీఎస్ఎన్ వర్మ కొనియాడారు. జేసీఐ విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో వెల్కం టు గ్రేట్ డే వేడుకలు శుక్రవారం రామ్‌నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఐ సభ్యులు, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే పది మందిని సత్కరించారు. జేసీఐ విశాఖ వ్యాలీ ప్రెసిడెంట్ అమరేష్ మాట్లాడుతూ వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేసీఐ విశాఖ వ్యాలీ సెక్రటరీ ఇంద్రజ, పూర్వ అధ్యక్షుడు పృథ్వీ, భరత్‌కుమార్, కేవీరావు తదితరులు పాల్గొన్నారు.

రాత పూర్వకంగా హామీ ఇస్తే సమ్మె విరమిస్తాం

దాబాగార్డెన్స్ : డిమాండ్ల పరిష్కారానికి అధికారులు రాతపూర్వకంగా హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తామని, లేదంటే సమ్మె కొనసాగిస్తామని సిటు నాయకులు తేల్చి చెప్పారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు నేతృత్వంలో శుక్రవారం చర్చలు జరిగాయి. ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవితో సిటు నాయకులు భేటీ అయ్యారు. ఈ చర్చల్లో సిటు నాయకుడు వెంకట్‌రెడ్డి పై విధంగా స్పందించారు.

జీవీఎంసీలో ఘనంగా ఇంజినీర్స్ డే



సత్కారం పొందిన ఇంజినీర్లతో మేయర్ హరివెంకటకుమారి


దాబాగార్డెన్స్ : ప్రగతికి పునాదులు ఇంజనీర్లేనని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని శుక్రవారం ఇంజనీరింగ్ పితామహుడు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ సత్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ భారత సాంకేతిక రంగానికి కలికితురాయి, ఎన్నో ప్రాజెక్టుల రూపశిల్పి మోక్షగుండం విశ్వేశ్వరయ్య మనకు ఆదర్శప్రాయుడైనారని పేర్కొన్నారు. ప్రతి ఇంజనీరు అంతటి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఇంజనీర్లను మేయర్ సన్మానించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 9 వినతులు

దొండపర్తి: పోలీస్ సిబ్బంది సమస్య పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 9 మంది సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ప్రమోషన్లు, డిప్యుటేషన్, ఇంక్రిమెంట్లు, క్వార్టర్స్ రద్దు చేసి హెచ్‌ఆర్ఏ మంజూరుకు సంబంధించిన వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించిన సీపీ వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



పలువురికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : శుక్రవారం 38వ వార్డు కంచరవీధికి చెందిన పొట్నూరు నాగేశ్వరరావు పెరాలసిస్ సమస్యతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అతన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 39వ వార్డు చిలకపేటలో నివసిస్తున్న వైఎస్సార్ గృహసారథి అద్దంకి ధనలక్ష్మి కుమార్తె సత్యవతి బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలుసుకుని ఆమెకి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త వాక సూరీడమ్మ భర్త రామారావు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, స్టేట్ డైరెక్టర్ ససపల రవీంద్ర భరత్, రీసు అనురాధ, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బోణి దేవ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.